# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-04-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఉగ్రవాదంపై దేశం చేస్తున్న యుద్ధంలో 140 కోట్ల మంది భారతీయుల ఐకమత్యమే అన్నిటి కంటే గొప్ప బలమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**

2. **దేశ అంతరిక్ష రంగం దినదినాభివృద్ధి చెందుతోందని.. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఒకేసారి 104 ఉపగ్రహాలను ప్రయోగించి రికార్డు నెలకొల్పిందని ప్రధానమంత్రి స్పష్టంచేశారు.**

3. **140 కోట్ల మంది భారతీయుల సంకల్ప శక్తితో "ఎక్ పేడ్ మా కే నామ్" ఉద్యమం విజయవంతమైందని, ఏడాది కాలంలో 140 కోట్లకు పైగా మొక్కలు నాటారని నరేంద్రమోదీ వెల్లడించారు.**

4. **అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా, బలహీన వర్గాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

5. **విశాఖ జిల్లా సింహాచలంలో ఈ రోజు నిర్వహించిన గంధం అమావాస్య వేడుకకు భక్తులు భారీగా తరలివచ్చారు.**

==========================

ఉగ్రవాదాన్ని అంతమొందించడానికి భారతదేశం చేస్తున్న యుద్ధంలో 140 కోట్ల మంది భారతీయుల ఐకమత్యమే అన్నిటి కంటే గొప్ప బలమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఆకాశవాణి ద్వారా ప్రసారమయ్యే మన్ కీ బాత్.. మనసులోని మాట కార్యక్రమం 121వ సంచికలో ఆయన ఈ రోజు తన మనసులోని భావాలను ప్రజలతో పంచుకున్నారు. ఈ నెల 22వ తేదీన పహల్గాంలో ఉగ్రవాదులు ఒడిగట్టిన ఘాతుకం దేశ ప్రజలు ప్రతి ఒక్కరినీ ఎంతో బాధకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కశ్మీర్‌లో శాంతి నెలకొంటోందని, రాష్ట్రాభివృద్ధిలో అద్భుతమైన వేగం కనిపిస్తోందని, ప్రజాస్వామ్యం ధృఢమవుతోందని, పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరుగుతోందని తెలిపారు. ఈ అభివృద్ధి నచ్చని దేశ శత్రువులు, జమ్ము కశ్మీర్ శత్రువులు ఇంత పెద్ద కుట్ర పన్నారని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఇంతటి క్లిష్ట సవాలును ఎదుర్కోవడానికి మనం మన సంకల్పాలను బలోపేతం చేసుకోవాలని, దేశం మొత్తం ఒకే గొంతుతో మాట్లాడటాన్ని ప్రపంచం గమనిస్తోందని ప్రధాన మంత్రి వివరిస్తూ..

...వాయిస్..35 సెకన్లు....

-------------------------

భారతదేశ అంతరిక్ష రంగం దినదినాభివృద్ధి చెందుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ.. ఇస్రోకు ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించిందని, ఒకేసారి 104 ఉపగ్రహాలను ప్రయోగించి రికార్డు నెలకొల్పామని తెలిపారు. సూర్యునికి దగ్గరగా తీసుకు వెళ్లిన ఆదిత్య ఎల్-1 మిషన్ విజయవంతం అయిందని, ఇంకా అనేక విజయాలను సొంతం చేసుకున్న భారత అంతరిక్ష రంగంలో ప్రైవేటు రంగానికి కూడా అవకాశం కల్పించామని చెప్పారు. రెండు రోజుల క్రితం కన్నుమూసిన గొప్ప శాస్త్రవేత్త కస్తూరి రంగన్.. భారత అంతరిక్ష రంగాన్ని నూతన శిఖరాలకు చేర్చారని ప్రధాన మంత్రి నివాళులు అర్పిస్తూ..

..వాయిస్.. 26 సెకన్లు....

---

మన దేశంలోని 140 కోట్ల ప్రజల సామర్థ్యం, వారి సంకల్పశక్తి చాలా గొప్పదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. కోట్లమంది ప్రజలు ఒకేసారి ఏదైనా ఉద్యమం ప్రారంభిస్తే, దాని ప్రభావం ఎంతో పెద్దగా ఉంటుందని అనడానికి ఒక ఉదాహరణ – "ఎక్ పేడ్ మా కే నామ్" ఉద్యమం అని తెలిపారు. జూన్ ఐదవ తేదీ "ప్రపంచ పర్యావరణ దినోత్సవం" నాటికి ఈ ఉద్యమాన్ని ప్రారంభించి ఏడాది పూర్తవుతుందని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ఈ ఏడాది కాలంలో ఈ ఉద్యమంలో భాగంగా అమ్మ పేరుతో 140 కోట్లకు పైగా చెట్లను నాటారని.. మన దేశం మొదలుపెట్టిన ఈ ఉద్యమాన్ని చూసి దేశం బయట కూడా ప్రజలు తమ అమ్మ పేరున మొక్కలు నాటారని నరేంద్రమోదీ వివరిస్తూ..

...వాయిస్...39 సెకన్లు....

---

ప్రపంచ వ్యాప్తంగా మన ప్రతిభకు మెప్పు లభిస్తోందని, భారతీయ యువత దేశం పట్ల ప్రపంచం దృష్టిని మార్చేశారని ప్రధానమంత్రి తెలిపారు. ప్రస్తుతం దేశ యువత సైన్స్, టెక్నాలజీ, ఇంకా ఆవిష్కరణల దిశగా సాగుతున్నారని చెప్పారు. సైన్స్, ఆవిష్కరణల పట్ల యువతలో పెరుగుతున్న ఈ ఆసక్తి భారతదేశాన్ని తప్పక నూతన శిఖరాలకు చేరుస్తుందని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అప్రమత్తత, అవగాహన అవసరమని.. అందుకోసం మన మొబైల్ ఫోన్‌లో ఒక ప్రత్యేక యాప్ ద్వారా సహాయం అందుతుందని ప్రధానమంత్రి వెల్లడించారు. సచేత్ అనే ఈ యాప్‌ను జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ-ఎన్‌డిఎమ్ఎ అభివృద్ధి చేసిందని చెప్పారు. వచ్చే నెల పదవ తేదీన మొదటి స్వతంత్ర పోరాట దినోత్సవం రాబోతోందని.. నాటి పోరాటంలో ఎగసిన నిప్పురవ్వలు, ముందు ముందు లక్షలమంది స్వాతంత్ర సమరయోధులకు కాగడాలుగా మారాయని నరేంద్రమోదీ తెలిపారు.

---

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందిస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అంబేడ్కర్ 135వ జయంతి వేడుకల్లో భాగంగా విజయవాడలో ఈ రోజు నిర్వహించిన అంబేడ్కర్ సమ్మాన్ అభియాన్‌కు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ.. మేధావుల సభల్లో అంబేడ్కర్ ఉండాలని అందరూ కోరుకుంటే, కాంగ్రెస్ మాత్రం ఆయన్ని అడ్డుకోవాలని కోరుకునేదని ఆరోపించారు. దేశానికి స్ఫూర్తి నింపిన అంబేడ్కర్‌కు భారతరత్న

ఇవ్వాలని వాజ్‌పేయి సూచించారని తెలిపారు. పార్లమెంట్‌లో అంబేద్కర్ చిత్ర పటాన్ని పెట్టిన ఘనత భారతీయ జనతా పార్టీకే దక్కుతుందని స్పష్టంచేశారు. అంబేద్కర్ నడయాడిన ప్రదేశాలను పంచ తీర్థాలుగా అభివృద్ధి చేసి గుర్తింపు తీసుకువచ్చామని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.

---------------------------

విశాఖ జిల్లా సింహాచలం క్షేత్రంలో గంధం అమావాస్య వేడుకను ఈరోజు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఒడిశా, ఉత్తరాంధ్ర, కోస్తా తీర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. కొండ దిగువన వరాహ పుష్కరిణి వద్ద పుణ్యస్నానాలు చేశారు. చెక్క కోలలను అప్పన్న స్వామి ప్రతిరూపంగా నెలకొల్పి పూజలు చేశారు. అనంతరం సింహగిరికి చేరుకుని అప్పన్న స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో స్వామి దర్శనానికి మూడు గంటల సమయం పడుతోంది. సింహగిరి మాడ వీధులు, కేశఖండన శాల, గంగధార ప్రాంతాల్లో రద్దీ నెలకొంది. కాగా.. చందనోత్సవం నేపథ్యంలో సింహాచలంలో నేటి నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఆర్జిత సేవలు రద్దు చేశారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి బి.శేఖర్ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ  కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్....38  సెకన్లు....

---------------------------

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి, పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎనలేని కృషి చేస్తున్నారని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం బోరెడ్డి గారిపల్లెలోని తన నివాసంలో మంత్రి ఈ రోజు ప్రజా దర్బార్ నిర్వహించారు.

=====================